# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై హ్యాకథాన్



జాతీయ స్థాయి హ్యాకథాన్‌కు ఎంపికైన జట్ల సభ్యులతో ప్రతినిధులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ పర్యావరణ విభాగం, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ కళాశాల సమావేశ మందిరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంశంపై ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్ నిర్వహించారు. దీనికి ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్ కళాశాలల నుంచి మంచి స్పందన లభించింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఈ పోటీలు నిర్వహించగా.. మొత్తం 96 జట్ల నుంచి ప్రతిపాదనలు వర్సిటీకి అందించారు. సీఎస్ఐఆర్-ఐఏసీటీ హైదరాబాద్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ పి.రాధాకృష్ణ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నటరాజన్, రాష్ట్ర పీసీబీ సీనియర్ పర్యావరణవేత్త ప్రసన్నకుమార్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అధినేత డాక్టర్ వి.హిమబిందు, అధ్యాపకురాలు డాక్టర్ టి.విజయలక్ష్మి, వీఎన్ఆర్ వీజేఐటీ ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ వి.మల్లిక, విశ్రాంత అధ్యాపకురాలు జానకి, కన్వీనర్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి హ్యాకథాన్‌కు వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, ప్రత్యామ్నాయ మెటీరియల్స్ విభాగాల్లో కలిపి ఉత్తమ ప్రతిపాదనలు అందించిన 17 జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు తర్వాత జాతీయ స్థాయిలో జరిగే హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారని నిర్వాహకులు ప్రకటించారు.

---

**నవభూమి**

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు చెక్..

## ఎకో హ్యాకథాన్‌లో 17 వినూత్న ఐడియాల ఎంపిక

- జేఎన్‌టీయూహెచ్, టీజీపీసీబీ సంయుక్తాధ్వర్యంలో కార్యక్రమం
- అద్భుతమైన స్పందన.. పాల్గొన్న 96 జట్లు
- ఎంపికైన జట్లకు త్వరలో జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం
- ఆవిష్కరణలను మూల్యాంకనం చేసిన నిపుణుల బృందం






కూకట్ పల్లి, నవభూమి ప్రతినిధి, జూన్ 9: పర్యావరణానికి తీవ్ర ముప్పుగా పరిణమించిన సింగిల్ యూజ్ (ఒక్కసారి వాడి పారేసే) ప్లాస్టిక్ సమస్యకు శాశ్వత పరిష్కారాలు కనుగొనే దిశగా యువత అడుగులు వేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్ పెట్టేలా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తాధ్వర్యంలో క్యాంపస్‌లో ఒకరోజు ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్ ను ఘనంగా నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సవాళ్లను అధిగమించేందుకు సుస్థిరమైన, ఆచరణాత్మక పరిష్కారాలను ప్రతిపాదించడానికి ఈ హ్యాకథాన్ విద్యార్థులకు ఒక అద్భుత వేదికగా నిలిచింది. ఈ వినూత్న కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల నుంచి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్ కళాశాలల నుంచి ఏకంగా 96 జట్లు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకుని ఉత్సాహంగా పాల్గొన్నాయి.

**జాతీయ స్థాయికి 17 అత్యుత్తమ జట్లు..**

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను నిపుణుల బృందం అత్యంత కఠినంగా పరిశీలించింది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, సరికొత్త రీసైక్లింగ్ విధానాలు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ పర్యావరణహిత పదార్థాల తయారీని లక్ష్యంగా చేసుకున్న అత్యుత్తమ, వినూత్నమైన ఆలోచనలకు గాను మూడు విభిన్న విభాగాల కింద 17 జట్లను విజేతలుగా ఎంపిక చేశారు. ఈ ఎంపికైన 17 జట్లు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో రాష్ట్రం తరఫున పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల తేదీలు త్వరలోనే ఖరారు కానున్నాయి.

**దిగ్గజాలతో మూల్యాంకనం..**

విద్యార్థులు అందించిన వినూత్న ప్రతిపాదనలను పలువురు ప్రముఖులతో కూడిన నిపుణుల బృందం మూల్యాంకనం చేసింది. ఈ బృందంలో సీఎస్ఐఆర్ ఐఐసీటీ (హైదరాబాద్) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ పి. రాధాకృష్ణ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నటరాజన్, వీఎన్ఆర్ వీజేఐఈటీ ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ వి. మల్లిక, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఓ. జానకి, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సీనియర్ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యూ.జీ. ప్రసన్న కుమార్, మరియు జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ టీ. విజయ లక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ ప్రతిష్టాత్మక హ్యాకథాన్ కార్యక్రమానికి సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ వి. హిమబిందు ప్రోగ్రామ్ కన్వీనర్‌గా వ్యవహరించగా.. జేఎన్‌టీయూహెచ్‌కు చెందిన డాక్టర్ వంశీకృష్ణ రెడ్డి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యా విభాగాలకు చెందిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు పెద్ద సంఖ్యలో పరిశోధక విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

www.navabhoomi.com
10 Jun 2026 - Page 6

---

# సింగిల్-యూజ్ ప్లాస్టిక్ సమస్య పరిష్కారానికి జేఎన్‌టీయూహెచ్ ఎకో-హ్యాకథాన్

**నవతెలంగాణ-కేపీహెచ్ బీ**

సింగిల్-యూజ్ ప్లాస్టిక్ సమస్యకు సుస్థిర పరిష్కారాలు కనుగొనే లక్ష్యంతో జేఎన్‌టీయూహెచ్‌లో పర్యావరణ కేంద్రం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఒకరోజు 'ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్' నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల నుంచి మొత్తం 96 జట్లు నమోదు చేసుకోగా, కఠిన పరిశీలన అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, ప్రత్యామ్నాయ పదార్థాలపై వినూత్న ఆలోచనలు ప్రతిపాదించిన 17 జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు జాతీయ స్థాయి






హ్యాకథాన్‌లో పాల్గొననున్నాయి. ఈ ప్రతిపాదనలను ప్రముఖ నిపుణుల బృందం మూల్యాంకనం చేయగా, ఈ కార్యక్రమానికి సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ హెడ్ డా. వి. హిమబిందు కన్వీనర్‌గా, డా.వంశీ కృష్ణారెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.